# అంచలంచెలుగా ఎదిగిన చందా...

**తాజాగా సిద్దిపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నిక..**

**నిబద్ధతతో ఎదిగిన ఆర్యవైశ్య నేత..**



సైదాపూర్ (వాయిస్ టుడే ):కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండల కేంద్రానికి చెందిన చందా శ్రీనివాస్ వైశ్య కుటుంబం నుంచి ప్రజాసేవలో నిబద్ధతతో అంచలంచెలుగా ఎదిగారు.వివిధ పదవుల్లో పనిచేసిన ఆయన ఆర్యవైశ్య కులానికి, సైదాపూర్ గ్రామ ప్రజలకు సేవలు చేసిన నేతగా గుర్తింపు పొందారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండల కేంద్రానికి చెందిన చిరు వ్యాపారి కుటుంబానికి చెందిన చందా నందయ్య- భూలక్ష్మి దంపతులకు చందా శ్రీనివాస్ జన్మించారు. అట్టడుగు స్థాయి నుంచి తన చతురతతో, మేధాశక్తితో అంచలంచెలుగా ఎదిగి ప్రస్తుతం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో వ్యాపార రంగంలో స్థిరపడ్డారు. సైదాపూర్ మండల ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షునిగా 1995నుంచి 2023వరకు 29సంవత్సరాల పాటు పనిచేశారు.ఈ క్రమంలో ఆర్యవైశ్యుల కులానికి, వ్యాపారులకు ఏ సమస్య వచ్చినా తాను ఉన్నానంటూ ముందు నడిచి వారి మన్ననలు పొందారు. 2019నుంచి 2024వరకు సైదాపూర్ సర్పంచిగా,సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షునిగా పనిచేశారు.ఈ క్రమంలో గ్రామ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించి గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి పథంలో నడిపించి గ్రామ ప్రజల మన్ననలు పొందారు. సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షునిగా మండలంలోని గ్రామాల్లోని నెలకొన్న పలు సమస్యల పరిష్కారంలో పాలుపంచుకున్నారు.ఈ క్రమంలో గతంలో 40ఏళ్లుగా ఆర్యవైశ్య కుటుంబాలకు, ప్రజలకు సేవలు అందించడాన్ని గుర్తించిన సిద్దిపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ తనని జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నుకున్నారు.చందా శ్రీనివాస్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నిక కావడం పట్ల అటు హుస్నాబాద్ పట్టణంతోపాటు జిల్లా ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు, తను పుట్టి పెరిగిన గ్రామమైన సైదాపూర్ గ్రామంలో ప్రజలు, మండలంలోని పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా చందా శ్రీనివాస్ మాట్లాడుతూ... తన సేవలను గుర్తించి సిద్దిపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు అమరావతి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి కొండ మల్లికార్జున్, కార్యదర్శి గంప శ్రీనివాస్,నాయకులు అయిత రత్నాకర్ల కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనకు వెన్నంటే నిలిచిన హుస్నాబాద్ పట్టణ ఆర్యవైశ్య మహాసభ నాయకులకు రుణపడి ఉంటానని తెలిపారు. తన మీద నమ్మకంతో ఈ పదవిని అందించిన వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఆర్యవైశ్య కుటుంబ సభ్యులకు తన వంతు సేవలు అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు.



## గిరిజన విద్యార్థుల అభ్యున్నతికి ఐటిడిఎపిఓ చేస్తున్న కృషికి హర్షం వ్యక్తం చేసిన పొంగులేటి

భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే బ్యూరో డిసెంబర్ 2: గిరిజన విద్యార్థిని విద్యార్థు ల విద్యా బలోపేతం కావడానికి ఐటీడీఏ పీవో బి రాహుల్ అనుసరిస్తున్న విధి విధానాలు గిరిజన పిల్లల విద్యాభివృద్ధికి ఎంతో ఉపకరిస్తాయని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

సోమవారం నాడు టేకులపల్లి మండలంలో పర్యటనలో భాగంగా ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖ రూపొందించిన ఉద్దీపకం పుస్తకములు ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన బాలబాలికల విద్యాభివృద్ధి పరంగా విద్యార్థులు సులభంగా వివిధ రకాల పాఠ్యాంశంలు సులభంగా నేర్చుకోవడానికి ఈ ఉద్దీపకములు ఎంతో దోహదం చేస్తాయని, ఉపాధ్యాయులందరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఈ ఉద్దీపకంలోని అంశాలను పిల్లల చేత తప్పనిసరిగా అర్థమయ్యేలా బోధించి వారి చేత రాయించాలని అన్నారు.

అంతకుము ందు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ టేకులపల్లి మండలంలోని ముత్యంపాడు లోని జిపిఎస్ పాఠశాల కోయగూడెంలోని ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు కొత్తగా ప్రవేశపెట్టిన మెనూ ప్రకారము సమయానుకూలంగా బ్రేక్ ఫాస్ట్ నుంచి మొదలుకొని డిన్నర్ వరకు వేడివేడిగా ఆహారము వడ్డించాలని, గిరిజన పిల్లల విద్యాభివృద్ధి కొరకు ఐటీడీఏ ద్వారా సరఫరా చేసిన ఉద్దీపకంలు బుక్ లెట్స్ తప్పనిసరిగా పిల్లల చేత రాయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు మరియు పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ నడిబొడ్డున బీసీల సమర శంఖారావం

**డిసెంబర్ 11,12 సదస్సు ధర్నాను విజయవంతం చేయండి**

**బీసీల సమర శంఖారావం పోస్టర్ ఆవిష్కరణ**

**-డాక్టర్ అవ్వారు వేణు కుమార్ ఓయు - ఓబీసీ జేఏసీ చైర్మన్**



కేంద్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న జనగణనల్లో కుల గణన కాల పట్టిక పెట్టి సమగ్ర కుల గణన చేయాలని డాక్టర్ అవ్వారు వేణు కుమార్ ఓబీసీ జేఏసీ చైర్మన్ అన్నారు. ఈ సందర్భంగా బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో జరిగే బీసీల సమర శంఖారాం కరపత్రం, పోస్టర్ ను ఓయూ విద్యార్థి నాయకుల మధ్యన ఆవిష్కరణ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ... డిసెంబర్ 11, 12 న ఢిల్లీ నడి బొడ్డున జాతీయస్థాయి ఓబీసీ సదస్సు, ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సదస్సుకు రాహుల్ గాంధీ, డీఎంకే పార్టీ నాయకులు, సామాజిక న్యాయం కోరుకునే వివిధ పార్టీలు, ఎంపీలు మేదావులు, న్యాయవాదులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొననున్నట్లు తెలిపారు. అనంతరం 12వ తారీకు ధర్నా కార్యక్రమం ఉంటుందని, ఈ ధర్నాను తెలంగాణ రాష్ట్రం నుంచి వచ్చే బీసీ ఇంటలెక్చువల్స్ పాల్గొని విజయవంతం చేయనున్నట్టు తెలిపారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల విషయంలో 50% రిజర్వేషన్ అడ్డు రాలేదు కానీ బీసీల ప్రాథమిక హక్కు అయిన బీసీ రిజర్వేషన్ పొందడానికి సీలింగ్ పేరిట 50% సాకుతో బీసీలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షులు చామకూర రాజు, కెవి గౌడ్, మాదిగ రిజర్వేషన్ పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్ల వెంకటేష్, పాల్వాయి నగేష్, మల్లేష్, న్యాయవాది భూపాల్, తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు బద్రి, బీసీ మీడియా%డ% కమ్యూనికేషన్ కన్వీనర్ బాలాచారి, ఓబీసీ విద్యార్థి సంఘం నాయకుడు ఏలే రాఘవేందర్, ఓయూ విద్యార్థి, బీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రజెండా ఒక ప్రాంతానికో... ఒక దేశానికో శాశ్వతం కాదు

**ఇది ప్రపంచ ప్రజా పోరాటాల చైతన్య రాజకీయ పార్టీ: మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి**



మిర్యాలగూడ 02 డిసెంబర్, ( వాయిస్ టుడే ) : నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో సోమవారం 21వ,నల్గొండ జిల్లా మహాసభల సందర్భంగా సిపిఎం పార్టీ కార్యకర్తలు భారీగా సాగర్ రోడ్డులోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుండి ప్రారంభమై ఎన్ఎస్పి క్యాంపు గ్రౌండ్ లో భారీ బహిరంగ సభ వరకు కొనసాగింది. అనంతరం ఈ కార్యక్రమ సభలో పార్టీకి చెందిన సీనియర్ నేతలు బివి.రాఘవులు,చెరుపల్లి సీతారాములు,జూలకంటి రంగా రెడ్డి,మల్లు లక్ష్మి,ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు.ప్రస్తుతం కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల పట్ల అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలపై తీవ్రంగా విమర్శిస్తూ బడుగు,బలహీన వర్గాలకు చెందిన నిరుపేదలకు కనీస అవసరాలైన కూడు,గూడు,విద్య,వైద్యం అందించడంలో ప్రస్తుత ప్రభుత్వాలు ఘోరంగా విఫలం చెందాయని విమర్శిస్తూ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యాయని తెలియజేస్తూ.వాటి అమలుకై ప్రజా ఉద్యమాలను పెద్ద ఎత్తున చేపడతామని ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించడం జరిగింది.ప్రజల సమస్యల పరిష్కారంకై ఒక ఎర్ర జెండాతోనే సాధ్యమని ఎర్రజెండానే ఎప్పుడు పేద ప్రజలకు మరియు కర్షక-కార్మికులకు అండ,దండగా నిలబడి నిత్యం ప్రజా సమస్యల పరిష్కారంపై పోరాడుతుందని కావున ప్రపంచ కార్మికులారా ఏకంకండి.పోరాడితే -పోయేదేమీ లేదని మహా అయితే బానిస సంకెళ్లు తప్పా.అనే నినాదాలతో బహిరంగ సభలో మార్మోగడం జరిగింది.ఎర్రజెండా పార్టీ కేవలం ఒక ప్రాంతానికో,ఒక దేశానికో పరిమితం కాదని ఇది ప్రపంచ రాజకీయ చైతన్య పార్టీ అని ఎర్రజెండా ఉన్న ప్రతి దేశంలో భవిష్యత్తులో కూడా మనదేశంలో ఎర్రజెండానే విజయకేతనం ఎగరవేస్తుందని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది. ఈ బహిరంగ సభలో డబ్బికార్ మల్లేష్,తుమ్మల వీరారెడ్డి,నారీ ఐలయ్య,వీరేపల్లి వెంకటేశ్వర్లు,రెమడాల పరశురాములు,రవి నాయక్, వీరాచారి,మల్లు గౌతమ్ రెడ్డి, పాండు,పుచ్చకాయల నర్సిరెడ్డి,బండ శ్రీశైలంతో పాటుగా వివిధ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.





## ట్రాక్టర్ బోల్తా పడి యువకుడి మృతి

వాయిస్ టుడే మహబూబ్ నగర్ జిల్లా డిసెంబర్ 2: జడ్చర్ల మండల పరిధిలోని కిష్టారం రాయికుంట మధ్యలో గల వాగులో రాయికుంట గ్రామానికి చెందిన తానెం యాదయ్య సన్నాఫ్ చిన్న నాగయ్య రైతు వరి చేనుపంట దిగుబడి చేసుకొని వడ్లు తీసుకోని రావడానికి వెళుతుండగా మార్గమధ్యంలో వాగు దాటుతుండగా ట్రాక్టర్ అదుపుతప్పి ఇసుక దిబ్బలో ట్రాక్టర్ ముందుకు సాగకపోవడంతో రివర్స్ తీసుకొని మళ్ళీ వెళదామని సమయంలో అనుకోకుండా ఇంజన్ తో సహా ట్రాక్టర్ పైకి లేచి వెనుకకు తిరిగి మీద పడటంతో తానం యాదయ్య అక్కడికక్కడే మృతి చెందిన ఘటన అంబతాపూర్ లో చోటుచేసుకుంది. మృతుని గ్రామస్తుల వివరాల ప్రకారం వాళ్ల సొంత పొలంలో పండిన వరి ధాన్యాన్ని తీసుకురావడానికి ట్రాక్టర్ తీసుకొని చేనుకు వెళుతుండగా మధ్యలో వాగు నుండే వారి చేనుకు దారి ఉండటంతో వాగు మార్గంలో వెళుతుండగా ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్తులు తెలియజేస్తున్నారు. విషయం తెలుసుకున్న జడ్చర్ల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ఆసుపత్రికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యులు తెలిపారు.

## యాదగిరిగుట్ట ఎమ్మెల్యే కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

వాయిస్ టుడే/యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలోని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కార్యాలయంలో ఆలేరు నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల లబ్ధిదారులకు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య గారు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేయనున్నారు. దయచేసి మీ గ్రామానికి సంబంధించిన లబ్ధిదారులకు ఈ సమాచారం అందజేసి మీరు ఈ కార్యక్రమంలో తరలిరావాలని కోరారు.

## కాళేశ్వరం నీరు రాకున్నా పెరిగిన సాగు: ఉత్తమ్



నల్గొండ, కోదాడ: కాళేశ్వరం నీటితోనే రాష్ట్రమంతా పంట పండుతుందనే అపోహను గత ప్రభుత్వం సృష్టించిందని, అదే ప్రాజెక్టు నుంచి చుక్క నీరు రాకపోయినా ఈ ఏడాది వరి సాగు పెరిగిందని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గంలోని మోతె, మునగాల, నడిగూడెం, అనంతగిరి, కోదాడ, చిలుకూరు మండలాల్లో సుమారు రూ.142 కోట్ల అభివృద్ధి పనులకు కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎస్సారెస్పీ సాగు నీటితో రైతులు పంటలు పండిస్తే భారాస ప్రభుత్వం కాళేశ్వరం ద్వారా రాష్ట్రమంతటా పంటలకు నీళ్లిచ్చామని గొప్పలు చెప్పుకొందని ఎద్దేవా చేశారు. ప్రపంచంలోనే గొప్ప ఎత్తిపోతల పథకమని చెప్పి కూలిపోయే ప్రాజెక్టును నిర్మించారని విమర్శించారు. ఈ ప్రాజెక్టు అవసరం లేకుండానే రాష్ట్రంలో వానాకాలం సాగులో 66.7 లక్షల ఎకరాల్లో 40 లక్షల మంది రైతులు 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి చేసి దేశంలోనే అరుదైన రికార్డు సాధించామని పేర్కొన్నారు. గెలిచిన ఏడాది లోపే రూ.22 వేల కోట్లతో రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ చేశామన్నారు. ఇప్పటి వరకు 9.53 లక్షల మెట్రిక్ టన్నుల సన్నాలను కొనుగోలు చేసినట్లు చెప్పారు. 1,48,517 మంది రైతులకు రూ.476.31 కోట్లు బోనస్ చెల్లించాల్సి ఉండగా, ఇప్పటి వరకు రూ.251.88 కోట్ల మేర చెల్లించామన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 50 వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. గ్యాస్ పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా 1.25 కోట్ల మందికి రూ.368.95 కోట్ల మేర చెల్లించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రామారావు, పాల్గొన్నారు.

## మలుపు నిద్రకొస్తూ.. తిరిగిరాని లోకానికి

**ఆగి ఉన్న గడ్డి ట్రాక్టరు ట్రాలీని ఢీకొట్టిన బైక్**

**భర్త మృతి, భార్య పరిస్థితి విషమం**

మేళ్లచెరువు: వీరిరువురు నవ దంపతులు. గత నెల 29న వీరి వివాహమైంది. మలుపు నిద్ర కోసం వధువు ఇంటికి బయలు దేరారు. కొద్దిసేపట్లో ఇంటికి చేరతామన్న సంతోషం అంతలోనే కనుమరుగైంది. అకస్మాత్తుగా జరిగిన రోడ్డు ప్రమాదం వరుడి ప్రాణాల్ని తీసింది. వధువునూ అపస్మారక స్థితిలోకి నెట్టేసింది. ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపిన ఈ ఘటన మేళ్లచెరువు సమీపంలో సోమవారం రాత్రి జరిగింది. మిర్యాలగూడ మండలం తడికమళ్ల గ్రామానికి చెందిన రాచూరు జానయ్య కుమారుడు ఉపేందర్(32)తో మేళ్లచెరువు మండలం వెల్లటూరు గ్రామానికి చెందిన గండారపు సూర్యనారాయణ చిన్న కూతురు రత్నకుమారికి నవంబరు 29న ఉపేందర్ ఇంటి వద్ద వివాహం చేశారు. అక్కడ నిద్రలు అయిపోయిన తర్వాత మలుపు నిద్ర కోసం తీసుకొచ్చేందుకు అమ్మాయి కుటుంబసభ్యులు వెల్లటూరుకు వెళ్లారు. ఆదివారం అమావాస్య కావడంతో సోమవారం సాయంత్రం అక్కడి నుంచి బయలు దేరారు. ఆటోలోనే అందరం కలిసి వెళ్దామని బంధువులు చెప్పారు. మళ్లీ ఆటో తిరిగి రావడం కుదరదనేసరికి తడికమళ్ల నుంచి ఈ కొత్త దంపతులు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. మార్గమధ్యలో హుజూర్‌నగర్‌లో అవసరమైన సరకులు కొనుగోలు చేసి ఆటోలో ఉన్నవారికి ఇచ్చి.. మళ్లీ బైక్ పైనే బయలుదేరారు. ఆటో కొంచెం వెనకబడింది. వీరు మేళ్లచెరువు సమీపానికి రాగానే చీకట్లో ఆగి ఉన్న గడ్డి ట్రాక్టరును గుర్తించలేదు. ఆ వేగంలో ట్రాలీ వెనక భాగాన్ని బైక్ బలంగా ఢీకొట్టడంతో ఉపేందర్, రత్నకుమారి ఇద్దరూ అక్కడే రోడ్డుపై పడటంతో వారి తలలకు తీవ్ర గాయాలయ్యాయి. మేళ్లచెరువు మండలం కందిబండకు వెళ్తున్న గడ్డి ట్రాక్టరులో డీజిల్ అయిపోవడంతో రోడ్డు పక్కనే ఆపి డ్రైవరు డీజిల్ తెచ్చుకునేందుకు వంద మీటర్ల దూరమే వెళ్లాడు. ఇంతలో పెద్ద శబ్దం విన్పించి వెనుదిరిగి వచ్చేసరికి ఉపేందర్ తీవ్ర రక్త స్రావంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.